ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★ శుక్రవారం 12 ఏప్రిల్ 2024

ఘనంగా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు 8లో..

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం నిర్వాసితుల ధర్నా 8లో..

అనధికారిక లేఅవుట్లపై చర్యలేవి?



సప్తగిరికాలనీలోని గోదావరి ముంపు ప్రాంతంలో అనధికారిక లే అవుట్లు

- ముంపు ప్రాంతాల్లోనూ ప్లాట్లు
- విస్తీర్ణాన్ని బట్టి మామూళ్లు
- కన్నెత్తి చూడని రామగుండం కార్పొరేషన్ అధికారులు
- టైటిళ్లలోనూ వివాదాలు.. మాయమాటలతో విక్రయాలు

కోల్‌సిటీ, ఏప్రిల్ 11: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో అనధికారిక లేఅవుట్లు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి దర్జాగా విక్రయిస్తున్నారు. గోదావరి ముంపు ప్రాంతాల్లో సైతం ప్లాట్లు పెట్టి విక్రయాలు జరుపుతున్నారు. వివాదాస్పద భూములు, కోర్టు వివాదాల్లోని భూముల్లో సైతం లే అవుట్లు పెట్టి మాయమాటలతో సామాన్యులకు ప్లాట్లు కట్టబెడుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్, డీటీసీపీ నుంచి ఎలాంటి లే అవుట్ అనుమతులు లేకుండానే కోట్ల రూపాయల లావాదేవీలు జరిగిపోతున్నాయి. కార్పొరేషన్ పెద్ద ఎత్తున ఆదాయం కోల్పోతోంది. రియల్టర్లు మాత్రం అనధికారిక లే అవుట్లకు మున్సిపల్ కార్పొరేషన్, ఇతర శాఖలకు, ప్రజాప్రతినిధులకు విస్తీర్ణాన్ని బట్టి మామూళ్లు ఇస్తూ నిరాటకంగా దందా సాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

రామగుండం నగరపాకల సంస్థ పరిధిలో 80 శాతం భూములు ఎన్‌టీపీసీ, సింగరేణి, ఆర్‌ఎఫ్ సీఎల్, జెన్‌కో పరిధిలో ఉన్నాయి. మిగిలిన 20 శాతం ప్రైవేట్ భూముల్లోనే కాలనీలు ఉన్నాయి. ఇందులో శివారు గ్రామాల పరిసరాలే ఎక్కువగా ఉన్నాయి. ఇందులోనే రియల్ ఎస్టేట్ దందా సాగు తోంది. రామగుండం నగపాలక సంస్థ పరిధిలోని ఎన్‌టీపీసీ ఇందిరమ్మ కాలనీ, కృష్ణనగర్, మాతంగి కాలనీ, గోదావరిఖని అడ్డగుంటపల్లి, దుర్గానగర్ బృందావన్ గార్డెన్ ఏరియా, గోదావరిఖని సప్తగిరి కాలనీలోని ఎన్‌టీపీ ఏరియాలు, స్విమ్మింగ్‌పూల్ సమీపాల్లో కొత్తగా వెంచర్లు పుట్టుకొచ్చాయి. గోదావరి వరదల్లో రెండేళ్ల ముంపునకు గురైన ముంపు ప్రాంతాల్లోనూ కొత్తగా వెంచర్లు చేస్తున్నారు.

గతంలో ప్రభుత్వం గోదావరి ముంపు ప్రాంతాల్లో భవన నిర్మాణ అనుమతులు ఇవ్వరాదని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పుడు ఏకంగా అనేధికారిక లే అవుట్లే పుట్టకొస్తున్నాయి. వ్యవసాయ భూములును కొని నాలా కన్వర్షన్‌తో నేరుగా లే అవుట్లు వేస్తున్నారు. ప్రభుత్వం అనధికారిక లే అవుట్లను కట్టడి చేసేందుకు 2021లో ప్రత్యేక జీవో తీసుకువచ్చింది. ఈ జీవోను అనుసరించి రెండు ఎకరాల భూములకు కూడా లే అవుట్ చేసేందుకు అవకాశం ఉంది. 10 శాతం ఓపెన్ స్పేస్ వదిలిపెట్టడం, రోడ్లు, డ్రైన్లు, విద్యుత్, ఇతర సౌకర్యాలు కల్పించడం వంటివి చేయాల్సి ఉంది. ఇందుకు 60 అడుగుల అప్రోచ్ రోడ్డుతో పాటు 30 అడుగుల రహదారులను అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. కానీ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎలాంటి అప్రువల్ లేకుండానే వెంచర్లు చేస్తున్నారు.

అడ్రస్ లేని టాస్క్‌ఫోర్స్

జిల్లాలో అనధికారిక లేఅవుట్లు, నిర్మాణాలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం వివిధ శాఖల సమన్వయంతో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో అనధికారిక లే అవుట్లు, నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అడ్డుకోవాల్సి ఉంటుంది. అలా వీలు కాని సమయంలో టాస్క్‌ఫోర్స్‌కు నివేదిస్తారు. టాస్క్‌ఫోర్స్ రంగంలోకి దిగి కూల్చివేతలు, తొలగింపులు చేపట్టాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో టాస్క్‌ఫోర్స్ అలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు.



బృందావన్ గార్డెన్ సమీపంలోని అనధికారిక లే అవుట్

కార్పొరేషన్ ఆదాయానికి గండి

రామగుండం నరపాలక సంస్థ అక్రమ లేఅవుట్ల వెనుక టౌన్‌ప్లానింగ్ పరోక్ష సహకారాలు ఉన్నాయనే ఆరోపణలున్నాయి. ఎకరాల కొద్ది భూముల్లో అనధికారిక లేఅవుట్లు పెట్టి క్రయ, విక్రయాలు జరుగుపుతున్నా పట్టించుకున్న పరిస్థితి లేదు. పలు అనధికారిక లే అవుట్లలో మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన డ్రైన్లను సైతం ఆక్రమిస్తున్నారు. లేఅవుట్ల అనుమతి కింద కార్పొరేషన్‌కు రావాల్సిన ఫీజులు, ఇతర ఆదాయాలు, ఓపెన్ స్పేస్‌లు రాకుండా పోతున్నా యి. అనధికారిక లే అవుట్లకు కార్పొరేషన్ అధి కారిక అనుమతి కన్నా అనధికారిక అనుమతులే ఇప్పుడు కీలకమయ్యాయనే ఆరోపణలున్నాయి. గతంలో ఒకటి రెండు లే అవుట్లలో హద్దురాళ్ల తొలగించడం, మళ్లీ వారు దందా చేసుకునేందుకు అనధికారిక క్లియరెన్స్‌లు ఇవ్వడం పరిపాటి అయ్యింది. లే అవుట్ల విస్తీర్ణాన్ని బట్టి శాఖల వారీగా రేట్లు నిర్ణయించి క్లియర్ చేస్తున్నారనే ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి.

జ్యోతిబా పూలే ఆశయ సాధనకు కృషి

- అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్



పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 11 : మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి, జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ మాట్లాడుతూ మహనీయుల జీవిత చరిత్ర, వారు సాధించిన విజయాలు అందరికీ తెలియాలని జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుతున్నామని అన్నారు. మహనీయులు చూపిన బాటలో అందరూ నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రంగారెడ్డి, అధికారులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించారు. పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కల్లెపల్లి అశోక్, సీపీఎం పెద్దపల్లి ఏరియా కార్యదర్శి సిపెల్లి రవీందర్, కుమ్మరి నవీన్, కుమ్మరి సదయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుపై ఆరోపణలు సరికాదు

- కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సదానందం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చొప్పరి సదానందం

ముత్తారం ఏప్రిల్ 11: మంత్రి శ్రీధర్‌బాబుపై అసత్యపు ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల పార్టీ అధ్యక్షులు దోడ్ల బాలాజిలు అన్నారు. ఇటీవల పుట్ట మధు మంత్రి శ్రీధర్‌బాబుపై చేసిన అరోపనలపై వారు స్పందించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంథనిలో రౌడీయిజానికి, రాక్షసత్వానికి, మారణహోమానికి బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనే నిదర్శనమని, మంథనిలో అక్రమ దందలకు, హత్యరాజకీయాలకు ప్రస్తుత జడ్పి చైర్మన్ పుట్ట మధు కేరాఫ్ అడ్రస్ అని ఆరోపించారు. ఇకనైనా మంత్రి శ్రీధర్‌బాబుపై అసత్యపు అరోపనలు చేయాడం మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

ఘనంగా రంజాన్ వేడుకలు

- ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, నాయకులు



పెద్దపల్లిలో ముస్లింలతో ఎమ్మెల్యే విజయరమణారావు..



గోదావరిఖనిలో శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



మంథనిలో శుభాకాంక్షలు తెలుపుతున్న జడ్పీ చైర్మన్ మధు



సుల్తానాబాద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



యైటింక్లయిన్ కాలనీలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మంథనిలో శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమ

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 11 : పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, సీపీఐ నాయకుడు తాండ్ర సదానందం ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, ముస్లిం మత పెద్దలు, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముత్తారం : మండలంలోని ముత్తారం, అడవిశ్రీరాంపూర్, ఓడేడు గ్రామాల్లోని గురువారం రంజాన్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు పేదవారికి ఆర్థిక సహాయం, దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు వేరువేరుగా పాల్గొని ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

సుల్తానాబాద్ : రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే వారు నూతన వస్త్రాలు ధరించి అందుబాటులో ఉన్న ఈద్గాల వద్దకు చేరుకుని అందరితో సామూహికంగా ప్రార్థనలు జరిపారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, వైస్‌చైర్‌పర్సన్ బిరుదు సమతక్రిష్ణ, కాంగ్రెస్ నాయకులు అంతటి అన్నయ్యగౌడ్, సాయిరి మహేందర్, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు ముస్లింలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. సుల్తానాబాద్ ఈద్గా వద్ద జరిగిన ప్రార్థనలలో ముస్లిం మత పెద్దలు, ప్రముఖులతో పాటు నాయకులు రాజలింగం, బాబురావు, అమీనొద్దిన్, పల్లా సురేష్, గాజుల హరీష్, అమిరిశెట్టి తిరుపతి తదితరులు పాల్గొన్నారు. కాగా గట్టేపల్లి గ్రామంలో ముస్లింలు స్థానిక మానేరు వద్ద నిరాహార దీక్షలు చేస్తున్న నాయకుల మధ్య రంజాన్ వేడుకలను జరుపుకున్నారు.

ఓదెల : మండలంలోని పొత్కపల్లి, కనగర్తి, కొలనూర్, జీలకుంట, గుంపుల గ్రామాల్లో గురువారం ముస్లింలు ఉత్సాహంగా రంజాన్ వేడుకలను నిర్వహించారు. అలాగే ప్రార్థనలు పూర్తయిన తర్వాత ఇమామ్‌లు, ముస్లింలు, వివిధ పార్టీల నాయకులు కలిసి ఆలింగనాలతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ధర్మారం : మండలంలో గురువారం రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం ఈద్గాల వద్ద ముస్లింలు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పండగ సందర్భంగా ముస్లింలకు పలు రాజకీయ పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

కాల్వశ్రీరాంపూర్ : మండలంలో పవిత్ర రంజాన్ వేడుకలు మదీనా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కాల్వశ్రీరాంపూర్‌తో పాటు మడిపల్లి, మోట్లపెల్లి తదితర గ్రామాల్లో ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంజాన్ వేడుకల్లో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గాజనవేన సదయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షులు గోరేమియా, ఉపాధ్యక్షులు అబ్దుల్ రహీం, మండల కోఆప్షన్ సభ్యులు ఎండి ఇబ్రహీం, కదిర్, తాజ్ మహమ్మద్, తాజ్, హుస్సేన్, హైమద్, మునిర్, నాయకులు అల్లం దేవేందర్ మాదాసి సతీష్, పులి ఇంద్రకరణ్‌రెడ్డి, శివరామకృష్ణ, సబ్బని రాయమల్లు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గురువారం ముస్లింలు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా మజీద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వారికి పలువురు నాయకులు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

మంథని : రంజాన్ పండగ వేడుకలను ముస్లింలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి ఈద్గాల వద్ద పెద్ద ఎత్తున ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జడ్పీ చైర్మన్‌పుట్ట మధు తన నివాసంలో, కుచిరాజ్‌పల్లి ఈద్గా వద్ద మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రి రమా-సురేష్ రెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నేతలు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

కళ్యాణ్‌నగర్ : రంజాన్ సందర్భంగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద ఉన్న ఈద్గ, ఫోరింక్లయిన గడ్డ వద్ద ఉన్న ఈద్గాలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యే అయిన తరువాత ఈద్గా చుట్టూ గోడల నిర్మాణం చేయడంతో పాటు షాదీఖానా నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్టు చెప్పారు. ముస్లిం మైనార్టీలకు ఏ సమస్య వచ్చినా నేరుగా తనను కలువవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ బంగి అనీల్ కుమార్, కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, సనా ఫక్రుద్దీన్, నాయకులు పాతిపెల్లి ఎల్లయ్య, నజీమోద్దీన్, గఫూర్, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

ఫోరింక్లయిన్ గడ్డ వద్ద ఉన్న ఈద్గాలో పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తనను ఎంపీగా గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఉన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: కాలనీలోని గురువారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఈద్‌గా వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జామాఇ మసీద్ ఇమామ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జామాఇ మసీద్ కమిటీ సభ్యులు ఎం.డి.షకిల్, ఆరీఫొద్దిన్, యూసఫ్‌అలీ కాలనీలోని ముస్లింలు పాల్గొన్నారు.

జూలపల్లి : మండల కేంద్రంతో పాటు వడుకాపూర్, పెద్దాపూర్, తెలుకుంట, కుమ్మరికుంటా తదితర గ్రామాల్లో గురువారం ముస్లింలు రంజాన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలువురు రాజకీయ నాయకులు ఈద్గాల వద్దకు చేరుకుని వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



ముత్తారంలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



పెద్దపల్లిలో ముస్లింలతో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



గోదావరిఖనిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఈశ్వర్

ఉపాధ్యాయుడి సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 11: పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్‌లో స్పెషలిస్టుగా విధులు నిర్వహిస్తున్న రాగంపేట చంద్రశేఖర్ అనే ఉపాధ్యా యుడి సస్పెన్షన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు డిమాండ్ చేశారు. గురువారం మహాత్మా జ్యోతిబాఫూలే జయంతి సందర్భంగా ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాడుగుల రాములు మాట్లాడుతూ సెయింట్ జాన్స్ స్కూల్‌లో నిర్వహిస్తున్న పదోతరగతి మూల్యాంకనం విధుల్లో భాగంగా బుధవారం స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న రాగంపేట చంద్రశేఖర్‌ను స్పాట్ విధులు, సర్వీసు నుంచి సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తు న్నామని, దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ఫోన్‌లో మాట్లాడు తున్నాడనే కారణంతో అక్రమంగా అన్యాయంగా సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఇలాంటి చిన్న కారణంతో సస్పెండ్ చేస్తే చివరకు ఒక్కరు కూడా స్పాట్ అయ్యే వరకు మిగులరని అన్నారు. చిన్న తప్పులకు పెద్ద శిక్ష వేయడం సరికాదని, కనీసం సంజాయిషీ కూడా కోరకుండా చర్యలు తీసుకోవడమేమిటని ప్రశ్నిం చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్‌రెడ్డి, రాగంపేట చంద్రశేఖరావు, జిల్లా ఉపాధ్య క్షులు ఎన్.బాలయ్య, జానకి, వి.బాల య్య, కార్యదర్శి ఎన్.శ్రీనివాస్, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై స్వామివారల విహారం



అశ్వ వాహనంపై విహరిస్తున్న స్వామి వారు

వేములవాడ, ఏప్రిల్ 11: శ్రీరామ నవరాత్రి ఉత్సవాల సందర్భం గా పార్వతీరాజరాజేశ్వరస్వామి, లక్ష్మీఅనంత పద్మనాభ స్వామివార లు గురువారం అశ్వవాహనంపై విహరించారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి దేవస్థానంలో కొనసాగుతున్న శ్రీరామ నవరాత్రి ఉత్సవాల మూడోరోజు ఉదయం ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు, వేద పండితులు రాజరాజేశ్వర స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సీతారామచంద్ర స్వామికి ఉపనిషత్ ద్వారాభిషేకం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. పరివార, అనుబంధ దేవతలకు అభిషేక ములు నిర్వహించారు. రాత్రి అందంగా అలంకరించిన అశ్వావాహ నంపై పట్టణ వీధుల మీదుగా స్వామివారలను ఊరేగించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



బుచ్చిరాంరెడ్డి(ఫైల్)

గంగాధర/చందుర్తి, ఏప్రిల్ 11: గంగాధర మండలం కురిక్యాల వద్ద ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలి పిన వివరాల ప్రకారం గురువారం రాజన్నసిరి సిల్ల జిల్లా చందుర్తి మండలం మర్రిగడ్డకు చెందిన నాయిని బుచ్చిరాంరెడ్డి (40) జీవనోపాధి కోసం కొత్తపల్లిలో ఉంటు న్నాడు. ద్విచక్రవాహనం(టీఎస్ 7ఈఎల్6 90 7)పై గురువారం ఉదయం స్వగ్రామ మైన మర్రిగడ్డ గ్రామానికి వచ్చి నర్సింగా పూర్ గ్రామంలో ఉంటున్న కూతరు దగ్గరికి వెళ్లాడు. అ నంతరం కొత్తపల్లికి వెళుతుండగా ఆ సమయంలో కరీంనగర్ నుంచి మధ్యప్రదేశ్‌కు వెళుతున్న ఓ వ్యాను(సీజీ4ఎన్ఎక్స్4779) గంగాధర మండలం కురిక్యాల మూల మలుపు వద్ద బుచ్చిరాంరెడ్డి వాహనాన్ని ఢీ కొట్టిం ది. కిందపడ్డ బుచ్చిరాంరెడ్డి తలకు తీవ్ర గాయమైంది. 108లో కరీం నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసు దర్యా ప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వందశాతం ఓటింగ్‌కు కార్యకర్తలు కృషి చేయాలి

- ఎంపీ బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఏప్రిల్ 11: కరీంనగర్ పార్లమెంట్‌పరిధిలో వంద శాతం ఓటింగ్‌కు కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం నగరంలోని రంగినేని గార్డెన్స్‌లో పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ బూత్ అధ్యక్షులు, కో-ఆర్డినేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లోని కార్యకర్తలు సైతం బీజేపీకే ఓటేసేందుకు సిద్ధమయ్యారన్నారు. దేశానికి ప్రధానిగా మోదీ పట్ల విశ్వసనీయత ప్రదర్శిస్తున్నారన్నారు. ఏడాది క్రితమే ప్రవేశపెట్టిన సేతుబంధన్ స్కీంలో ఆర్‌ఓబీకి నిధులు తీసుకు వస్తే ఐదేళ్లక్రితం ఎంపీగా తాను ఎలా నిధులు తీసుకువచ్చాడో బీఆర్ఎస్ అభ్యర్థి సమాధానం చెప్పాలన్నారు. మంత్రి పదవి రాగానే పొన్నం ప్రభాకర్ మిడిసిపడుతున్నాడన్నారు. కరీంనగర్‌లో బీజేపీ మెజారిటీతో గెలువడం ఖాయమైపోయిందని, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండో స్థానం కోసం పోటీ పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదతరులు పాల్గొన్నారు. కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ పరామర్శించారు. ఆయనతో పాటు కటకం లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సాయి ఆలయంలో అఖండ నామ సంకీర్తన



అఖండ నామ సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 11: జిల్లా కేంద్రంలోని కృష్ణా నగర్‌లో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో గురువారం నిర్వహించిన సాయి అఖండ నామ సంకీర్తన ఓం సాయి శ్రీసాయి జయ జయ సాయి అంటూ భక్తుల నామ స్మరణతో మారుమ్రోగింది. సాయి ఆలయంలో వారం రోజుల పాటు నిర్వహించనున్న సాయి అఖండ నామ సంకీర్తన మొదటి రోజు గురువారం వేద పండితుల పూజ కార్యక్రమంతో ఘనంగా ప్రారంభించారు. సాయి బాబా విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన 1008 కళశాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ సతీష్ కుమార్, నాగుల కిషన్ గౌడ్, మార కైలాసం, రవి చంద్ర, కిషన్, పురుషోత్తంరావు, రాంకిషన్‌రావు, రాజలింగం, తవుటు రాంచంద్రం, తిరుపతి, మారుతి, గుండేటి రాజు ఉన్నారు.

'షట్చక్రం' గ్రంథానికి గండ్ర హనుమంతరావు స్మారక పురస్కారం



షట్చక్రం గ్రంథం, లక్ష్మణ చక్రవర్తి

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 11: తెలంగాణ విశ్వవిద్యాలయ తెలుగు శాఖ ఆచార్యుడు, విమర్శకుడు డాక్టర్ లక్ష్మణ చక్ర వర్తి రచించిన 'షట్చక్రం' గ్రంథం గండ్ర హనుమంతరావు స్మారక పురస్కారానికి ఎంపిక యింది. ప్రతియేటా రాష్ట్ర స్థాయిలో కవిత్వ యేతర ప్రక్రియలకు అందించే ఈ పురస్కారానికి 'షట్చక్రం' ఎంపికయినట్లు కమిటీ బాధ్యులు ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈనెల చివరి వారంలో ఈ పురస్కారం ప్రదానం చేయనున్నారు.

పోచమ్మకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు



శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, ఏప్రిల్ 11: మల్యాల కొత్తపేటలో పోచమ్మకు భక్తులు గురువారం మొక్కులు చెల్లించుకున్నారు. ఇటీవల నూతనంగా నిర్మించిన ముత్యాల పోచమ్మ ఆలయంలో ఎస్సీ కాలనీ వాసులు ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బోనాల వేడుకలు నిర్వహించగా మహిళలు బోనాలతో గ్రామంలో శోభాయాత్రతో ఆలయానికి వచ్చి పోచమ్మకు బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ వేడుకలో ఎస్సీ కాలనీ వాసులతో పాటు గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా మైసమ్మ ప్రాణ ప్రతిష్ఠ

- ఆలయంలో కుంకుమ పూజలు చేసిన మహిళలు



ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 11: సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లో బంగారు మైసమ్మతల్లి ఆలయంలో మైసమ్మ తల్లి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి, అలయం పునర్ నిర్మాణంలో భాగంగా చేపట్టిన మూడు రోజుల కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజు గురువారం వార్డు కౌన్సిలర్ దార్ల కీర్తన సందీప్ ఆధ్వర్యంలో అలయ ఆవరణలో మహాయజ్ఞాన్ని పూజారి రాచర్ల రఘురామశర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం వంద మంది మహిళలు కుంకుమ పూజలతో పాటు రుద్రహోమం, మూల మంత్ర హవనం, శయ్యాధివాస, పూజలు చేశారు. కార్యక్రమాల్లో టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య, మున్సిపల్ కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బోద్దుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పి మాంసాన్ని విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 11: న్యూమారేడు పాకలో దుప్పిని చంపి మాం సాన్ని విక్రయి స్తున్న ముగ్గురు వ్యక్తుల ను గురువారం గోదావరి ఖని టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సమాచారం రావడం తో టూటౌన్ సీఐ బి.రవీందర్, ఎస్ఐ సనత్‌కుమార్ అక్కడికి చేరుకొని మాంసం విక్రయిస్తున్న లోకిని మల్లేష్, గంట మోహన్, బండారి సురేందర్ లను పట్టుకుని ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు.

కంటైనర్‌లో వచ్చి.. రెక్కీ చేసి.. ఏటీఎం చోరీ



సీసీ టీవీ ఫుటేజీతో నిందితుడి గుర్తింపు

అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుడిని అరెస్టు చేసిన పోలీసులు

వారంతా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారు. లారీలపై పని చేస్తూ దొంగతనాలు అలవాటు చేసుకున్నారు. మార్చి 18న ఓ కంటైనర్‌తో హుజూరాబాద్‌కు వచ్చారు. శివారు ప్రాంతంలోని ఓ దాబా వద్ద కంటైనర్‌ను ఉంచి పట్టణంలోకి ప్రవేశించారు. రాత్రి వేళలో ఇళ్ల ఎదుట నిలిపి ఉంచిన ఓ కారును, బైకు దొంగిలించారు. వాటిపై ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు వచ్చారు. అక్కడి పరిస్థితులను గమనించి వెళ్లిపోయారు. తెల్లవారు జామున మళ్లీ ఏటీఎం వద్దకు సీసీ కెమెరాపై నల్ల రంగు స్ప్రే చేశారు. అనంతరం గ్యాస్‌కట్టర్‌తో ఏటీఎంను బద్దలు కొట్టి నగదును చోరీ చేసి కారు, బైక్‌పై పారిపోయారు. తుమ్మనపల్లి శివారులో వాహనాలను వదిలి కంటైనర్ వద్దకు నడుచుకుంటూ వచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు.. ఎటువంటి ఆధారాలు లేకుండా సవాలుగా మారిన ఈ కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. ఈ ముఠాలోని ఓ సభ్యుడిని అరెస్టు చేశారు.

హుజూరాబాద్, ఏప్రిల్ 11: హుజూరాబాద్ ఎస్‌బీఐ ఏటీఎం చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘటనకు పాల్పడిన ముఠాలోని ఓ సభ్యుడిని అరెస్టు చేశారు. ఈ కేసుకు సబంధించిన వివరాలను హుజూరాబాద్ పోలీస్ స్టేషన్లో ఏసీపీ శ్రీనివాస్‌జీ గురువారం వెల్లడించారు. ఈ సందర్భంగా మార్చి 18 హుజూరాబాద్ కోర్టు సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎంను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి 8.64 లక్షల రూపాయలను గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లారన్నారు. బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలు చోరీ జరిగిన రోజు సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించిందని తెలిపారు.

ఆర్‌జే11 జీబీ 7370 అనే కంటైనర్ అనుమానాస్పదంగా కనిపించిందని, ఆ కంటైనర్ పక్కన ముషారఫ్ అనే వ్యక్తిని బృందంలోని సభ్యులు గుర్తించారన్నారు. బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అదే కంటైనర్ కనిపించిందని, అందులోని వ్యక్తిని గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయని ఏసీపీ చెప్పారు. మార్చి 18న హర్యాణాకు చెందిన ముషారఫ్, అతని సోదరుడు సఫత్, ఫరీద్, ఢిల్లీకి చెందిన అఫ్తాబ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన సాజీద్ ఆర్‌జే11జీబీ7370అనే కంటైనర్ లారీలో హుజూరాబాద్ శివారులోని ఓ దాబాకు వచ్చారన్నారు. అక్కడ లారీని నిలిపి పట్టణంలోకి వచ్చి ఓ కారు, మోటర్ సైకిల్‌ను దొంగతనం చేశారన్నారు. ఆ వాహనాలపై తిరుగుతూ ఎస్‌బీఐ ఏటీఎం వద్ద రెక్కీ నిర్వహించారని తెలిపారు.

అక్కడి నుంచి వెళ్లిపోయి తెల్లవారు జామున ఏటీఎం వద్దకు వచ్చి సీసీ కెమెరాకు నల్ల రంగు స్ప్రే చేశారని చెప్పారు. అనంతరం గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను ధ్వంసం చేసి 8.64 లక్షల రూపాయలు దోచుకొని తుమ్మనపల్లి శివారులో వాహనాలను వదిలిపెట్టి కంటైనర్ లారీలో పారిపోయారన్నారు. బుధవారం వాహన తనిఖీల్లో ముషారఫ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అతడు వివరాలన్నీ వెల్లడించాడన్నారు. ముషారఫ్ వద్ద నుంచి 60 వేల రూపాయలు, కంటైనర్ లారీని స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారీలో ఉన్న మిగితా నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. సమావేశంలో టౌన్ సీఐ బొల్లం రమేష్, ఎస్ఐ సాంబయ్య, హెడ్‌కానిస్టేబుల్ రాజేశ్వర్‌రావు, నెల్లి మోహన్, అవినాష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

నేతన్నలకు ఉపాధి కల్పించాలి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 11: సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమల సంక్షోభాన్ని నివారిం చేందుకు నేతన్నలకు ఉపాధిని కల్పించేందుకు ప్రభుత్వ ఆర్డర్‌లను ఇప్పిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామిచ్చారని, త్వరగా ప్రభుత్వ ఆర్డర్‌లను అందించి నేతన్నలను ఆదుకోవాలని జేఏసీ నాయకులు కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు బుధ వారం సాయంత్రం హైదరాబాద్‌లోని సచివాలయంలో చేనేత జౌళి శాఖ కార్యాలయంలో సిరిసిల్లకు చెందిన జేఏసీ నాయకులతోపాటు వ్యాపారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రలల్లో నెలకొన్న సమస్యలతోపాటు బతుకమ్మ చీరలు, యారన్ సబ్సిడీ, విద్యుత్ సబ్సిడీతోపాటు వివిధ సమస్యలపై డైరెక్టర్ అలుగు వర్షిణికి వినతి పత్రాన్ని అందించామని జేఏసీ నాయకులు తెలిపారు. అనంతరం కరీంనగర్‌లో ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి డైరెక్టర్ అలుగు వర్షిణికు చెప్పిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరగా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశామని వివరించారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్‌లు మూషం రమేష్, పంతం రవి, సభ్యులు కూరపాటి రమేష్, మండల సత్యం, మంచె శ్రీనివాస్, తాటిపాముల దామోదర్, గోలి వెంకటరమణ, సిరిసిల్ల రవీందర్, సిరిమల్లె సత్యం, కుమ్మరికుంట కిషన్, వేముల దామోదర్, పిస్క మధు, కోడం రమణ, అశోక్, గౌడరాజు, గోనే పర్శరా ములు, ఏనుగుల ఎల్లయ్య, బండారి అశోక్, నక్క దేవదాస్, గుండు రమేష్, గోవిందు రవి తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన జేఏసీ నాయకులు

మూడు ప్రైవేటు ఆస్పత్రుల ప్రసూతి గదులు సీజ్



వైద్యుడికి నోటీస్ ఇస్తున్న డీఎంహెచ్‌వో

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 11: రా జన్న సిరిసిల్ల జిల్లాలోని మూడు ప్రైవేటు ఆస్పత్రుల ప్రసూతి గదులను(లేబర్ రూంలు)గురు వారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుమన్ మోహన్‌రావు మాట్లాడారు. 202 3-24లో జిల్లాలో 100 శాతం ప్రసవాలు సిజేరియన్ ద్వారా మాత్రమే నిర్వహించారన్నారు. సిరిసిల్ల పట్టణంలోని సరయు ఆస్పత్రి, వేములవాడలోని అమృత నర్సింగ్ హోమ్, వాసుదేవ ఆ స్పత్రుల్లో వంద శాతం ప్రసవాలు సిజేరియన్ ద్వారా చేశారని, కలెక్టర్ ఆదేశాల మేరకు మూడు ఆస్పత్రుల్లోని ప్రసూతి గదులు సీజ్ చేశామని తెలిపారు. ఆస్పత్రుల వైద్యులకు, నిర్వాహకులను నోటీసులు అందజేశామన్నారు. ప్రభుత్వం నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు మూడు ఆస్పత్రుల్లో ప్రసవాలు నిర్వహించడానికి వీలులేదని తెలిపారు. నిబంధనలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉప వైద్యాధికారులు శ్రీరాములు పాల్గొన్నారు.



ఆస్పత్రి ప్రసూతి గదిని సీజ్ చేస్తున్న అధికారులు

పరిహారం ఇచ్చిన తరువాతే భవనాలను నిర్మించాలి

- పనులను అడ్డుకున్న రైతులు



రైతులతో మాట్లాడుతున్న టౌన్ సీఐ రఘుపతి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 11: పరిహారం ఇచ్చిన తర్వాతనే మెడికల్ కళాశాల అదనపు భవనాలను నిర్మించాలని రైతులు డిమాండ్ చేశారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్‌లో చేపట్టిన మెడికల్ కళాశాల అదనపు భవనాల నిర్మాణ పనులను రైతులు బుధవారం అడ్డుకున్నారు. గురువారం ఉదయం తిరిగి పనులు ప్రారంభించగా రైతులు, వారి కుటుంబ సభ్యులు సుమారు వంద మంది పనులను అడ్డుకున్నారు. ఈ విషయాన్ని కాంట్రాక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టౌన్‌సీఐ రఘుపతితో పాటు నలుగురు ఎస్ఐలు సిబ్బందితో కలిసి ఆ ప్రాంతానికి చేరుకోని ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం తమ భూములను తీసుకొని ఇబ్బందులకు గురిచేస్తోందని, కాంట్రాక్టర్ తమపై ఇష్టానుసారంగా మాట్లాడడంతోపాటు దాడులకు పాల్పడుతున్నాండని రైతులు సీఐకు వివరించారు. దీంతో సీఐ రఘుపతి మాట్లాడుతూ రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. దాడులు చేసుకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సోమవారం ఆర్డీవో కార్యాలయానికి వస్తే చర్చించి సమస్య పరిష్కారం అయ్యేలా చూద్దామని చెప్పడంతో రైతులు శాంతించి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు భూక్యరెడ్డినాయక్, లింగంపల్లి సత్యనారాయణ, పెద్దూర్ సింగిల్ విండో డైరెక్టర్ సలేంద్రీ బాలరాజుయాదవ్, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ ఉలిసె తిరుపతి, చెన్నమనేని కమలాకర్‌రావు, అకునూరి బాలరాజు, అశోక్, రాజశేఖర్, ఎనగందుల ప్రేమల, లింగంపల్లి దేవరాజు, గొడుగు మల్లేశం, గొడుగు ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

ఆరు గ్యారెంటీలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ

భగత్‌నగర్, ఏప్రిల్ 11: కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే ఆరు గ్యారెంటీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ అన్నారు. గురువారం నగరలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కొండగట్టు అంజన్న మొక్కులు తీర్చుకోవడానికి వెళ్లి అసత్య వ్యాఖ్యలు చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎంపీ అభ్యర్థికరువయ్యాడని, ఫ్రస్టేషన్‌లో ఉండి అలా మాట్లాడుతున్నారన్నారు. బండి సంజయ్ చేసిన అభివృద్ధిపై పుస్తకం ముద్రించి ఇంటింటికీ పంపిణీ చేశారన్నారు. ఎంపీ నియోజకవర్గ పరిధిలో 12 వేల కోట్ల రూపాయల అభివృద్ధి చేశారన్నారు. ఆ పుస్తకాన్ని మంత్రికి పోస్టులో పంపిస్తామని చదువుకోవాలని హితవు పలికారు. బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్, కేటీఆర్, కవితపై ఎందుకు మాట్లాడడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు, అభివృద్ధి పనులపై దృష్టి పెడితే మంచిదన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేష్, మాజీ ఎంపిపి వాసాల రమేష్, అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, మీడియా కన్వీనర్ కటకం లోకేష్, జిల్లా అధికార ప్రతినిధులు బొంత లకళ్యాణ్‌చంద్ర, ఎడమ సత్యనారాయణరెడ్డి, జానపట్ల స్వామి, రాగి సత్యనారాయణ, బండ రమణారెడ్డి, మామిడి రమేష్, అవదుర్తి శ్రీనివాస్, పోరెడ్డి శ్రీధర్ పాల్గొన్నారు.



పార్లమెంట్ అభివృద్ధిపై ముద్రించిన పుస్తకాన్ని చూపిస్తున్న రాణి రుద్రమ

తండ్రి మృతితో మనస్తాపం.. కుమారుడి ఆత్మహత్య



విశ్వతేజ మృతదేహం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 11: మండలంలోని అయిలా పూర్ గ్రామానికి చెందిన మారంపల్లి విశ్వతేజ (22) అనే యువకుడు తన తండ్రి మృతికి మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం విశ్వతేజ తండ్రి గంగధర్ రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి విశ్వతేజ మనస్థాపానికి గురై తరచు బాధపడేవాడు. బుధవారం రాత్రి ఇంట్లో అందరు నిద్రిస్తున్న సమయంలో తన బెడ్‌రూంలో ఉరేసకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విశ్వతేజ తల్లి చిన్న లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

హోరాహోరీగా ఎడ్లబండ్ల పోటీలు



విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న దాత నిశాంత్‌రెడ్డి

గొల్లపల్లి, ఏప్రిల్ 11: గొల్లపల్లి మండలం చిల్వకోడూర్‌లోని శ్రీ రామ లింగేశ్వర స్వామి జాతర ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలు గురువారం హోరా..హోరీగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 19 ఎడ్లబండ్లు పోటీల్లో పాల్గొనగా ఆద్యంతం ఉత్కంఠభరితంగా జరిగాయి. పోటీలను ఆలయ ఛైర్మన్ తిరుపతి గౌడ్, వైస్ ఛైర్మన్ కోమురయ్య జెండా ఊపి ప్రారంభించారు. పోటీలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి జనం తండోపతండాలుగా తరలివచ్చారు. పోటిల్లో ప్రథమ విజేతగా ఎండపల్లి మండలం జగదేవ్ పేట గ్రామానికి చెందిన బచ్చల శివకృష్ణ ఎడ్లబండి నిలవగా, దాత గొల్లపల్లి తాజా మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి-దీప్తి దంపతులు అందించిన 2.5 గ్రాముల బంగారం గెలుచుకున్నారు. ద్వితీయ, తృతీయ బహుమతులుగా 100, 50 గ్రాముల వెండిని దాతలు బంగిమరం శంకరయ్య జ్ఞాపకార్థం బంగిమరం లలిత-శివకుమార్, బంగిమరం సంతోషిణి-శివప్రసాద్, కోట వెంకన్న జ్ఞాపకార్థం కోట సుజాత-అశోక్ దంపతులు అందించిన గొల్లపల్లి మండలం తిర్మలాపూర్ (పీడీ) గ్రామానికి చెందిన షేక్ బాషామీయా, ఎండపెల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన మెట్‌పల్లి అజయ్ ఇద్దరు సమానంగా పంచుకున్నారు. అనంతరం విజేతలకు దాతలు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమీటీ ఛైర్మన్ దాసరి తిరుపతి గౌడ్, వైస్ ఛైర్మన్ సింగారపు కోమురయ్య, తాజామాజీ ప్రజా ప్రతినిధులు చిర్ర గంగాధర్, రేవెళ్ల సత్యానారాయణ గౌడ్, నాయకులు పురంశెట్టి వెంకటేశం, శివకుమార్, వేణు, రాజయ్య, మహేష్, విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎడ్లబండ్ల పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

ఘనంగా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు


ఖనిలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


మంథనిలో నివాళులర్పిస్తున్న పుట్ట మధు


నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమ, కాంగ్రెస్ నేతలు


ఖనిలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు


కనగర్తిలో పూలే జయంతి నిర్వహిస్తున్న నాయకులు


బాల్‌రాజ్‌పల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు


కాలనీలో మాట్లాడుతున్న జీడి సారయ్య

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 11 : మండలంలోని పెద్దబొంకూర్‌లో మిట్టపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మామిడి నవీన్, కలవేన రవి, తిరుపతి, రాజు, మధునయ్య, శ్రీనివాస్, అఖిల్, పవన్, సంపత్, రాజయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ముత్తారం : మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిబా పూలే జయంతి కార్యక్రమాన్ని సుల్తానాబాద్‌లో నిర్వహించిన నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు పూలే జీవితం గురించి, ఆయన సేవల గురించి వివరించారు.

ఓదెల : సంఘసంస్కర్త జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా మండలంలోని కనగర్తి, కొలనూర్‌తోపాటు తదితర గ్రామాలలో గురువారం వేడుకలను నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సమాజంలో కుల వివక్ష, బలహీన వర్గాలకు హక్కులు, మహిళలకు విద్యా అవకాశాల కోసం పూలే చేసిన పోరాట పటిమను కొనియాడారు. కార్యక్రమంలో కోడం స్వామి, రాజయ్య, మచ్చ నర్సింగం, రావుల స్వామి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య, భైరి రవిగౌడ్, దొడ్డే శంకర్, సాతూరి అనిల్, జీదుల పాపయ్య తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మండలకేంద్రంలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డితో పాటు పలువురు నాయకులు హాజరై జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తన జీవితాంతం అట్టడుగువర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు జ్యోతిబా పూలే అన్నారు. సమాజంలో అనేక ఇబ్బందులకు గురైన నిమ్నజాతులను మేల్కొలిపి వారి హక్కుల సాధనకు కృషి చేసిన మహాత్ముడు పూలే అన్నారు. నేటి యువత పూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు ఆడేపు రాజు, పాల రాజేశం, మా దాసి సతీష్, పులి ఇంద్రకరణ్ రెడ్డి, శివరామ కృష్ణ, మునీర్, నల్బని రాజమల్లు, గుడ్ల సంపత్, పింగిలి మల్లారెడ్డి, గరిగంటి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో జ్యోతిబా పూలే జయంతి వేడుకలను పార్టీలకు అతీతంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలో కులవివక్ష, అంటరానితనంపై పోరాటం చేసిన సంఘ సంస్కర్త అని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కొరుకంటి వెంకటేశ్వర్‌రావు, బూర్ల వెంకటసత్యం, తాటిపల్లి రమేష్ బాబు, న్యాతరి పోచయ్య, మండిగ రాజనర్సు, బింగి రాజు, కప్పంపల్లి బాపయ్య, కొండయ్య, చంద్రయ్య, కప్పల ప్రవీణ్ పాల్గొన్నారు.

రామగిరి : మండలంలోని సెంటినరీకాలనీ పట్టణంలోని టిటూ సెంటర్‌లో జ్యోతిబా పూలే జయంతి వేడుకను గురువారం బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మోల్మామూరి శ్రీనివాస్, తీగల శ్రీధర్, దొంతుల సురేష్, కోటి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మంథని : మహాత్మా జ్యోతిబా పూలే జయంతి పురస్కరించుకొని మంథని, మండలంలోని గుంజపడగు గ్రామంలో పూలే విగ్రహాలకు జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు, పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తగరం సుమలత, బీఆర్ఎస్ నేతలు తగరం శంకర్‌లాల్, ఏగోళపు శంకర్‌గౌడ్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక గాంధీచౌక్‌లో మహాత్మా జ్యోతిభాపూలే జయంతి వేడుకలను నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ, కాంగ్రెస్ నేతలు పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్ : బడుగుల, బలహీనవర్గాల అభివృద్ధి కోసం మహాత్మా జ్యోతిబా పూలే ఎనలేని కృషి చేశారని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. గురువారం జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా రాజేష్ టాకీస్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిబా పూలే మహిళలకు విద్య అందించడమే లక్ష్యంగా తన భార్య అయిన సావిత్రి పూలేను మొట్టమొదటి ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్ది ప్రతి వ్యక్తికి విద్యను అందించడానికి కృషి చేశారన్నారు. విద్యతోపాటు ఉన్నతమైన ఆలోచనను పెంపొందించారని, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అహోరాత్రులు శ్రమించిన వ్యక్తి పూలే అని, సమ సమాజ స్థాపనే లక్ష్యంగా ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ బంగి అనీల్ కుమార్, కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, కొలిపాక సుజాత, కల్వల శిరీష, కాల్వ లింగస్వామి, నాయిని ఓదెలు, తిప్పారపు శ్రీనివాస్, బొమ్మక రాజేష్, మాలెం మధు, కళ్యాణి సింహాచలం, యుగంధర్, అశోక్, అంబేద్కర్ సంఘం నాయకులు బొంకూరి మధు, న్యాతరి రాయమల్లు, కొంకటి లక్ష్మణ్, మైస రాజేష్, మంథని లింగయ్య, గొర్రె రమేష్ పాల్గొన్నారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ రాజేష్ టాకీస్ వద్ద ఉన్న జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో సీపీఐ ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. సీపీఐ నగర కార్యదర్శి కనకరాజు ముఖ్యఅతిథిగా హాజరై పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గౌతం గోవర్ధన్, కే స్వామి, రంగు శ్రీనివాస్, తొడుపునూరి రమేష్ కుమార్, మార్కపురి సూర్యం, రేణికుంట్ల ప్రీతం, రాజయ్య, కనకయ్య, మల్లేష్, జగన్, రాజయ్య, అశోక్, కుమారస్వామి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. టీడీపీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల ఏడుకొండలు, కంది చంద్రయ్య, దామోదర్‌రెడ్డి, రాజనర్సు, ఇటుకల రాయలింగు, బరిగెల కళావతి, అశ్విని, రాజేశ్వరి, స్రవంతి పాల్గొన్నారు. బీఎస్పీ ఆధ్వర్యంలో గోదావరిఖని చౌరస్తాలో బీఎస్పీ ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే చిత్రప టానికి బీఎస్పీ ఇన్‌చార్జి ఇరికిళ్ల కనకయ్య, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు నరేష్, రాజన్నయ్య, సంతోష్, తోకల రమేష్, పర్వతాలు, మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లి : మండలంలోని బాల్‌రాజ్‌పల్లి గ్రామంలో మండల దళిత, బీసీ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో గురువారం మహాత్మా జ్యోతిరావ్‌పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిసి, దళిత సంఘాల నాయకులు ఎంపిటిసి దండె వెంకటేశం, మానుమండ్ల శ్రీనివాస్, కోరెపు సంపత్, వడ్లూరి చంద్రమౌళి, కుంటూరి స్వామి పలువురు నాయకులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ : జ్యోతిబా పూలే జయంతిని సింగరేణి ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పోతనకాలనీ అంబేద్కర్ విగ్రహ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సంఘం భారత నాస్తిక సమాజం జాతీయ అధ్యక్షుడు జీడి సారయ్య పాల్గొన్నారు. ఈసందర్భంగా పూలె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అడ్డాపురం చంద్రమౌళి, నాచగోని దశరథం, హరీష్, రమేష్, సదానందం, భరత్ తదితరులు పాల్గొన్నారు.


పెద్దబొంకూర్‌లో నివాళులు అర్పిస్తున్న యువకులు


ముత్తారంలో నివాళులు అర్పిస్తున్న నాయకులు


కల్వశ్రీరాంపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

కాళేశ్వరం ప్రాజెక్టులో దోపిడీని బహిర్గతం చేస్తాం

- కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ శశిభూషన్‌కాచే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శశిభూషన్‌కాచే

మంథని, ఏప్రిల్ 11: కాళేశ్వరం ప్రాజెక్టు మీద చేసిన దోపిడీ అంతా త్వరలోనే బయటికి వస్తుందని, ఇందులో అక్రమాలకు పాల్పడిన వారందరికీ తగిన శిక్ష పడుతుందని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ శశిభూషన్‌కాచే, ఎంపీపీ కొండ శంకర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అయిలి ప్రసాద్‌లు అన్నారు. గురువారంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు తనపై కాంగ్రెస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేసి ప్రజలకు దూరం చేశారని.. తాను అక్రమాలు చేస్తే ఎందుకు రుజువు చేయడం లేదని మాట్లాడారన్నారు. త్వరలో ఆయన చేసిన అవినీతి, అక్రమాలు బయటికి వస్తాయన్నారు. పుట్ట మధు నన్ను ఎప్పుడు జైలు పంపుతారా అని వేచిచూస్తున్నట్లుగా ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అక్రమాలన్నింటిని బయటికి తీసుకువచ్చే పనిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సిరిపురం బ్యారేజీల నిర్మాణం లోపాలపై, భూసేకరణ సక్రమంగా జరిగిందా, ప్రాజెక్టు కట్టింది నీళ్ల కోసమా.. లేక ఇసుక కోసమా అనే విషయాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరుగుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుపెట్టుకొని అవినీతికి పాల్పడిన కేసీఆర్ నుంచి పుట్ట మధు వరకు అందరికీ శిక్ష పడుతుందన్నారు. అధికారంలో ఉన్న సమయంలో నియోజకవర్గంలో అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, దాడులు చేశారన్నారు. వీటన్నింటికి తప్పకుండా శిక్ష అనుభవిస్తారన్నారు. పుట్ట మధూకర్‌ను ప్రజలు గమనించారు కాబట్టే గత ఎన్నికల్లో 18 వేల ఓట్లు, తాజాగా జరిగిన ఎన్నికల్లో 32 వేల ఓట్ల మెజార్టీని కాంగ్రెస్ పార్టీకి ఇచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100రోజుల్లో ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సబ్సిడీ అమలుచేశామన్నారు. తన నాయకుడు అధికారంలోకి వచ్చిన తరువాత ప్రధాన రహదారులు అద్దంలా మెరుస్తున్నాయన్నారు. భవిష్యత్తులో కూడా కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు వొడ్నాల శ్రీనివాస్, పేరవేన లింగయ్య యాదవ్, పోలు శివ, మంథని సత్యం, ఎరుకల ప్రవీణ్, తోకల మల్లేలు పాల్గొన్నారు.

కబ్జాకు గురవుతున్న పాండవుల గుట్ట

- అధికారులు దృష్టి సారించాలని గ్రామస్థుల విజ్ఞప్తి


కబ్జాకు గురవుతున్న పాండవుల గుట్ట ప్రాంతం

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 11: పాండవుల గుట్ట ప్రాంతం దినదినం కబ్జాకు గురవుతోంది. సంబంధిత అధికారులు దృష్టిసారించాలని క్యాలశ్రీరాంపూర్ గ్రామ ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రానికి ఆనుకుని ఉన్న పాండవుల గుట్ట ప్రాంతం 597 సర్వే నంబర్ కాగా, గుట్ట ప్రాంతం సుమారు 200ఎకరాల పైనే ఉంటుంది. మండల కేంద్రంలో ఎక్కడ ప్రభుత్వ స్థలం లేక పోవడంతో 597సర్వే నంబర్‌గల పాండవుల గుట్ట ప్రాంతంలో గతంలో పోలీస్ స్టేషన్, వ్యవసాయ మార్కెట్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డబుల్ బెడ్ రూమ్‌లతో పాటు రైతు వేదిక నిర్మించారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు పాండవుల గుట్ట ప్రాంతంలో జగత్‌మహా మునీశ్వర స్వామి ఆలయం ఉంది. కస్తూర్బా బాలికల పాఠశాల కూడా ఈ ప్రాంతంలో నిర్మించారు. మరో వందలాది ఎకరాల భూమి పాండవులగుట్ట ప్రాంతంలో ఉండగా, గతంలో ఇక్కడ పని చేసిన తహశీల్దార్లు ఎలాంటి అసైన్‌మెంట్ కమిటీ లేకుండా పక్క గ్రామాలకు చెందిన వారికి, వ్యయసాయ భూములు ఉన్న వారికి, వ్యాపారులకు పాండవుల గుట్ట ప్రాంతంలోని భూమిని పట్టా చేశారు. ఇప్పటికే పాండవుల గుట్ట ప్రాంతమంతా అక్రమ పట్టాలతో కొందరు కబ్జాచేశారు. మరికొందరు ఎలాంటి పట్టా లేకున్నా కబ్జాచేసి సాగు చేస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో అధికారంలో ఉండగా కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ రెసిడెన్షియల్ కాలేజీ కోసం సంబంధిత అధికారులు సర్వే చేస్తుండగా కొందరు భూమి తమదంటూ అధికారులను అడ్డుకున్నారు. వ్యవసాయ భూములు, వ్యాపారాలు ఉన్నవారు కూడా గుట్ట భూమిని కబ్జా చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి పాండవుల గుట్ట ప్రాంతాన్ని సర్వే చేయించి ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నత్తనడకన డబుల్ రోడ్డు నిర్మాణ పనులు

ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు


జూలపల్లి, వడుకాపూర్ మధ్య రోడ్డుపై నిలిచిన వాహనాలు(ఫైల్)

జూలపల్లి, ఏప్రిల్ 11 : జూలపల్లి మండల కేంద్రం నుంచి వడుకాపూర్, కాచాపూర్ గ్రామాల మధ్య కొనసాగుతున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ప్రయాణికు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న భారీ చెట్ల తొలగింపు రెండు మాసాలుగా మందకొడిగా జరుగుతుండడంతో ఆ రోడ్డు గుండా ప్రయాణించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని ఆరోపిస్తున్నారు. చెట్ల తొలగింపు సందర్భంగా రోడ్డుకు అడ్డంగా చెట్లు పడిపోవడంతో వాహనాలు ముందుకు వెళ్లలేక రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోతున్నాయని, అత్యవసర వైద్యం కోసం ఆసుపత్రులకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని పలువురు మండిపడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి చెట్ల తొలగింపు త్వరలో పూర్తిచేయాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి విప్ అడ్లూరి అండ..

వెల్గటూర్, ఏప్రిల్ 11: మండలంలోని జగదేవ్‌పేట గ్రామానికి చెందిన ఓ బాధిత కుటుంబానికి ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అండగా నిలిచారు. జగదేవ్‌పేటకు చెందిన భీమయ్య అనే వ్యక్తి అనారోగ్యంతో ఆసుపత్రిలో మృతి చెందాడు. బిల్లు కట్టలేని పరిస్థితిలో ఉన్న కుటుంబ పరిస్థితిని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న విప్ అడ్లూరి ఎల్‌వోసీ ద్వారా రూ.2.50 లక్షలు మంజూరు చేసి మృత దేహాన్ని ఆసుపత్రి నుండి తీసుకవచ్చేలా చేయడంతో బాధిత కుటుంబ సభ్యులు అడ్లూరికి కృతజ్ఞతలు తెలిపారు. అంత్యక్రియల నిమిత్తం తక్షణ సాయంగా రూ.5 వేలు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేంధర్‌రెడ్డి ద్వారా అందజేశారు.

ఘనంగా ధ్వజారోహణ పూజలు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 11: వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం హెలీప్యాడ్ గ్రౌండ్ ప్రక్కన గల ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ధ్వజారోహణ, ద్వార తోరణ పూజలు ఘనంగా జరిగా యి. మేయర్ సునీల్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. గరుడ ధ్వజంతో పాటు యాగశాల, ఆలయం లో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపేందర్, వేంకట్‌రావు, ప్రవీణ్, నాగరాజు, ప్రభాకర్, ఆలయ కమి టీ బాధ్యులు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.



ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కోసం నిర్వాసితుల ధర్నా


ధర్నా చేస్తున్న లద్నాపూర్ నిర్వాసితులు

రామగిరి, ఏప్రిల్ 11: సింగరేణి తమకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీపై తాత్సారం చేయడాన్ని నిరసిస్తూ మండలంలోని లద్నాపూర్ భూ నిర్వాసితులు గురువారం ఆందోళనకు దిగారు. ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2 విస్తరణ పనుల్లో భాగంగా గ్రామానికి సంబంధించిన 283 మంది లబ్ధిదారులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కల్పించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ సింగరేణి పనులను అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న సింగరేణి అధికారులు అక్కడి చేరుకొని సముదాయించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ తమ నిరసనను కొనసాగించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటన చోటు చేసుకోకుండా ఎస్ఐ సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

సమస్యల పరిష్కారానికి కమిటీలు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 11: సింగరేణిలో కార్మికులసమస్యల పరిష్కారానికి మైన్స్, సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేస్తామని గుర్తింపు సంఘం మందమర్రి ఏరియాబ్రాంచ్ సహాయకార్యదర్శి కంది శ్రీనివాస్, సోంశెట్టి రాజేశం తెలిపారు.గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏరియాలోని అన్నిగనులు, డిపార్టుమెంట్‌లలో సమావేశాలు ఏర్పాటు చేసి మెజార్టీ నాయకుల అభిప్రాయాల మేరకు కమిటీలను ఎంపిక చేస్తామన్నారు.

అంబేద్కర్ జయంతి నిర్వహణపై జీఎంల సమీక్ష


అధికారులతో చర్చిస్తున్న ఆర్జీ-2 జీఎం


సమావేశంలో మాట్లాడుతున్న జీఎం సుధాకర్‌రావు

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 11: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి నిర్వహణపై ఆర్జీ-2 ముఖ్య అధికారులతో గురువారం జీఎం సూర్యనారాయణ సమీక్షా సమావేశం నిర్వహించారు. అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఏరియా పరిధిలో కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు జయంతి కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్వోటూ జీఎం ఎన్ వెంకటేశ్వరరావు, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, అధికారులు ఎర్రన్న, ధనుంజయ, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

రామగిరి : అంబేద్కర్ జయంతి వేడుకల ఏర్పాట్లపై గురువారం ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జీఎం కార్యాలయంలో దళిత, గిరిజన ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈనెల 14న నిర్వహించనున్న అంబేద్కర్ జయంతి వేడుకల ఏర్పాట్లను ఘనంగా చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అధికారులు ఎలీషా, సీతారామం, రఘుపతి, సత్యనారాయణ, రాధాకృష్ణ, శ్రీనివాసులు, శ్రావణ్‌కుమార్, వినాయక్, చంద్రశేఖర్, పద్మరాజు, ముప్పిడి రవీందర్‌రెడ్డి, ఐలయ్య, జనార్ధన్‌రెడ్డి, గుర్రం శ్రీహరి, సునీల్ ప్రసాద్, సంఘాల ప్రతినిధులు దూప్‌సింగ్, బత్తులశంకర్, కిషన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రామగిరి, ఏప్రిల్ 11: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం జీఎం సుధాకర్‌రావుకు ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. అందులో ప్రధానంగా డంపర్‌కు ఎల్ఈడీ లైట్స్ అమర్చాలని, సీఈఆర్ క్లబ్‌లో డైనింగ్ హాల్, కిచెన్ నిర్మాణం చేపట్టాలని, ఉత్పత్తి ఆశాజనకంగా రావడంపై ప్రతి ఒక్క ఉద్యోగికి స్వీట్ బాక్సులు పంపిణీ చేయాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు సత్రం సమ్మయ్య, బెల్లం శ్రీనివాస్, వెంకటస్వామి, సదానందం, మనోహర్, రవికుమార్, లక్ష్మయ్య, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


జీఎంకు వినతిపత్రం అందిస్తున్న రవీందర్‌రెడ్డి